# ఆలయాల్లో చోరీ.. ముగ్గురు నిందితుల అరెస్ట్

**-నాలుగు సీసీ కెమెరాలు, రూ.20,600 నగదు స్వాధీనం**

**-చోరీకి వినియోగించిన ఆటో సీజ్**



**ఉరవకొండ ,జూలై15(నేటి దర్శిని):**
ఉరవకొండ పోలీస్ సర్కిల్ పరిధిలోని రెండు ఆలయాల్లో జరిగిన చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. ఈ కేసులకు సంబంధించి ముగ్గురు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది, ఉరవకొండ ఎస్సై జనార్ధన్ నాయుడు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. పెన్నహోబిలంలోని ఉద్భవ లక్ష్మీదేవి ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు సీసీ కెమెరాలు, హుండీని ధ్వంసం చేసి అందులోని నగదును అపహరించారు. అలాగే కొనకొండ్లలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలోనూ హుండీని పగులగొట్టి నగదు చోరీ చేశారు. ఈ ఘటనలపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా తోటకూర గుజ్జుల విశ్వతేజ, తలారి వంశీకృష్ణ, బోయ మహేష్‌లను నిందితులుగా గుర్తించిన పోలీసులు వజ్రకరూరు మండలంలోని ఎస్వీ గోడౌన్ వద్ద అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు సీసీ కెమెరాలు, రూ.20,600 నగదు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ, ఎస్సై వెల్లడించారు.

## గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ...



**మడకశిర, ,జూలై15(నేటి దర్శిని):**
శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం లోని అమరాపురం మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు ఇ.లక్ష్మీరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి, ఆహార నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలుపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వంటశాల, భోజనశాల, నిల్వ గదులను పరిశీలించిన ఆయన, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం అందిస్తున్నారా, ఆహారం నాణ్యంగా, రుచికరంగా ఉందా అనే విషయాలను విద్యార్థినులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. భోజనం విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా, మెనూ ప్రకారం అన్ని పదార్థాలు అందుతున్నాయా అనే అంశాలపై వారితో మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ఆహారం అందించడం అత్యంత ముఖ్యమని లక్ష్మీరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఆహార ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఆహార పదార్థాల నిల్వ, వంట ప్రక్రియ, పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని సంబంధిత సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం, విద్యాభివృద్ధికి తోడ్పడాలని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని, నాణ్యత లేని ఆహారం అందించినా లేదా ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించినా సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు.

## తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఈటెలకు ఆహ్వానం



**హైదరాబాద్, ,జూలై15(నేటి దర్శిని):**
ఈ నెల 19న తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని మేడ్చల్ - మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్‌ను సంఘం ప్రతినిధులు బుధవారం ఆహ్వానించారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జోర్రిగల శ్రీనివాస్, రాష్ట్ర కోశాధికారి పాతకోటి ఉమా, రాజకీయ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొల్లం చంద్రమౌళి, ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి మాదిరె నాగరాజు, ఉప్పల్ మండల నాయకులు శ్రీనన్న, ఉప్పలయ్య పాల్గొన్నారు. సంఘం ప్రతినిధుల ఆహ్వానాన్ని ఈటెల రాజేందర్ సాదరంగా స్వీకరించినట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు తెలంగాణ మేదరి మహేంద్ర సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

# బీజేపీ తాళ్లరేవు మండల ఓబీసీ మోర్చా నూతన కార్యవర్గానికి నియామక పత్రాల ప్రదానం

**కోనసీమ,జూలై15(నేటి దర్శిని):**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ సమావేశంలో కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలానికి సంబంధించిన భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రొక్కల గోపి శ్రీనివాస్, అంబేద్కర్ కొనసీమ జిల్లా బీజేపీ అధ్యక్షులు అడబాల సత్యనారాయణ , అంబేద్కర్ కొనసీమ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు పసుపులేటి మహాలక్ష్మి రావు, తాళ్లరేవు మండల బీజేపీ అధ్యక్షులు యానమండ్ర విజయ్ చేతుల మీదుగా తాళ్లరేవు మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా దంగేటి కృష్ణమూర్తి, ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ--1గా వాతాడి శివ, ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ--2గా శీలం శ్రీనుకు నియా మక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి



తాళ్లరేవు మండల ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వాతాడి శివ మాట్లాడుతూ తనను పార్టీ గుర్తించి ఈ బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర, జిల్లా మరియు మండల నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసి ప్రజాసేవకు అంకితమవుతానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఓబీసీ మోర్చా నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# బాపట్లకు డిజిటల్ ముఖచిత్రం

**-'బే ఆఫ్ బాపట్ల' వెబ్‌సైట్‌కు కలెక్టర్ ప్రశంసలు..**

**-విద్యార్థిని చాందిని శ్రీ ప్రతిభకు అభినందనలు..**

**-ఆగస్టు 15 నాటికి సమగ్రంగా సిద్ధం చేయాలని ఆదేశం**

**బాపట్ల, ,జూలై15(నేటి దర్శిని):**
బాపట్ల జిల్లా పర్యాటక, చారిత్రక విశేషాలతో పాటు ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసేలా విద్యార్థిని రూపొందించిన 'బే ఆఫ్ బాపట్ల' వెబ్‌సైట్ నమూనాను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ అభినందించారు. జిల్లాకు డిజిటల్ ముఖచిత్రంగా నిలిచేలా వెబ్‌సైట్‌ను మరింత సమగ్రంగా తీర్చిదిద్దాలని సూచించారు.
చీరాల సెయింట్ ఆన్స్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీ విభాగం చివరి సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థిని విన్నకోట చాందిని శ్రీ రూపొందించిన 'బే ఆఫ్ బాపట్ల' వెబ్‌సైట్ నమూనాను బుధవారం కలెక్టర్‌కు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వెబ్‌సైట్ నిర్మాణం, వినియోగ విధానం, ప్రజలకు కలిగే



ప్రయోజనాలను చాందిని శ్రీ వివరించింది. ప్రజెంటేషన్‌ను పరిశీలించిన కలెక్టర్.. విద్యార్థిని ప్రతిభను ప్రశంసించారు. ప్రస్తుతం ఉన్న స్వర్ణ బాపట్ల పోర్టల్‌కు అనుసంధానమయ్యేలా కొత్త వెబ్‌సైట్‌ను మరింత సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. జీఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ యశ్వంత్ పర్యవేక్షణలో ఆగస్టు 15 నాటికి వెబ్‌సైట్‌ను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని ఆదేశించారు.


**ప్రజల కోసం ప్రత్యేక వెబ్‌సైట్**

కలెక్టర్ అప్పగించిన బాధ్యతను సవాల్‌గా స్వీకరిస్తున్నట్లు చాందిని శ్రీ తెలిపింది. కలెక్టర్ సూచనల మేరకు నెల రోజుల్లో సరికొత్త వెబ్‌సైట్‌ను సిద్ధం చేస్తానని పేర్కొంది. ప్రస్తుతం స్వర్ణ బాపట్ల వెబ్‌సైట్ జిల్లా ఉద్యోగులకు మాత్రమే అందుబాటులో ఉందని, తాను రూపొందిస్తున్న కొత్త వెబ్‌సైట్‌ను ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా తీర్చిదిద్ది స్వర్ణ బాపట్ల పోర్టల్‌తో అనుసంధానిస్తామని వివరించింది. కొత్త వెబ్‌సైట్‌లో జిల్లా పర్యాటక ప్రాంతాలు, పండుగలు, చారిత్రక విశేషాలు, వసతి సౌకర్యాలు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపింది. పౌరులు తమ ఫిర్యాదులు, సలహాలు, సూచనలు తెలియజేసేందుకు కూడా ప్రత్యేక అవకాశం కల్పించనున్నట్లు చాందిని శ్రీ వివరించింది. ఈ సందర్భంగా చాందిని శ్రీ తండ్రి విన్నకోట శ్రీనివాసరావు, తాతయ్య కె.ఎస్., మామయ్య వేజండ్ల శ్రీనివాసరావు జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జ్ఞాపికగా కలెక్టర్‌కు పెన్నును అందజేశారు.

# మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దు..

**-శ్రీవారి భక్తులకు టీటీడీ అదనపు ఈవో విజ్ఞప్తి**

**తిరుమల ,జూలై15(నేటి దర్శిని):**
తిరుమల శ్రీవారి దర్శనం, వసతి గదులు, ఆర్జిత సేవలు తదితర బుకింగ్‌ల కోసం భక్తులు తప్పనిసరిగా టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే బుకింగ్ చేసుకోవాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి కోరారు. సోషల్ మీడియా వేదికలలో, అనధికారిక వెబ్‌సైట్లలో, మధ్యవర్తుల ద్వారా వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మి మోసపోవద్దని భక్తులకు సూచించారు. భక్తుల విశ్వాసాన్ని ఆసరాగా చేసుకుని కొందరు నకిలీ వెబ్‌సైట్లు, అక్రమ మార్గాల ద్వారా డబ్బులు వసూలు చేసే ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని, అలాంటి



వారి బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. శ్రీవారి దర్శనం, వసతి, సేవల బుకింగ్‌లు, టికెట్ల విడుదల, రద్దు అయిన టికెట్ల లభ్యత, వివిధ దర్శనాల సమాచారం, వేచి ఉండే సమయం వంటి అన్ని వివరాలను టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు. ఎస్వీబీసీ ద్వారా కూడా భక్తులకు నిరంతరం అధికారిక సమాచారాన్ని చేరవేస్తున్నామని చెప్పారు. టికెట్లకు సంబంధించిన ఏవైనా సందేహాలు ఉంటే టీటీడీ కాల్ సెంటర్ నెం: 155257 సంప్రదించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మధ్యవర్తులకు లేదా అనధికారిక వ్యక్తులకు డబ్బులు బదిలీ చేయవద్దని కోరారు. ఎవరైనా మధ్యవర్తులు, దళారులు , అనధికారిక వ్యక్తులు బుకింగ్‌ల పేరుతో సంప్రదించినట్లయితే టీటీడీ విజిలెన్స్ ఫిర్యాదు విభాగం ఫోన్ నెం: 98668 98630 సమాచారం అందించాలని కోరారు.

# లక్ష్యాల సాధనే ధ్యేయంగా పనిచేయాలి

**- రెఫరెన్స్ లేఖల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు**

**-మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ శిక్షణలో వెనుకబాటు పై అసంతృప్తి**

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం ,జూలై15(నేటి దర్శిని):**
ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలులో కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా ప్రతీ పథకం వంద శాతం అర్హులకు చేరేలా అధికారులు క్షేత్రస్థాయి ప్రగతి సాధించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి వివిధ మండలాల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రొటీన్‌కు భిన్నంగా సత్వర ఫలితాలు సాధించాలన్నారు. నీటి వనరుల సంరక్షణ కోసం చేపట్టిన జలధార పనుల్లో శ్రీకాకుళం జిల్లా అద్భుత ప్రగతిని సాధించిందని, జిల్లాలో మంజూరైన మొత్తం 4,766 పనులకు గానూ ఇప్పటికే 4,756 పనులు (99.79శాతం ) పూర్తయ్యాయని, ముఖ్యంగా గంగువారిసిగడాం, లావేరు, రణస్థలం వంటి మండలాల్లో శతశాతం పనులు ముగిశాయని కలెక్టర్ తెలిపారు. పర్యావరణ సమతుల్యత కోసం నూతనంగా ప్రవేశపెట్టిన నమో వన యోజన కింద నేషనల్ కాంపా నిధులతో ముమ్మరంగా మొక్కలు నాటాలని,



హెక్టారుకు 30 వేల నుంచి 40 వేల మొక్కల సాంద్రత ఉండేలా బహుళ అంచెల పద్ధతిలో జియో-ట్యాగింగ్ చేస్తూ పర్యవేక్షించాలని ఆదేశించారు. అదే సమయంలో, సచివాలయ సిబ్బందికి, ప్రజలకు డిజిటల్ సేవలపై అవగాహన కల్పించే మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ శిక్షణలో జిల్లా కేవలం 15.63శాతం ప్రగతితో రాష్ట్రంలో 16వ స్థానంలో వెనుకబడి ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని 732 సచివాలయాల పరిధిలో ఇప్పటివరకు కేవలం 96,552 గృహాలను మాత్రమే కవర్ చేశారని, సరుబుజ్జిలి, జలుమూరు వంటి మండలాలు కొంత మేలైనప్పటికీ మిగిలిన మండలాల అధికారులు తక్షణమే ప్రత్యేక శ్రద్ధ పెట్టి వంద శాతం నమోదు పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రై డే కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, గత వారం 2,93,561 ఇళ్లను సందర్శించి 30,040 చోట్ల గుర్తించిన దోమల ఉత్పత్తి కేంద్రాలను తక్షణమే నివారించగలిగామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సేకరించిన 3,20,333 రక్త నమూనాల్లో కేవలం 6 మలేరియా కేసులు మాత్రమే నమోదయ్యాయని, అలాగే 6 ల్యాబ్‌ల ద్వారా చేపట్టిన 3,837 నీటి పరీక్షల్లో కాలుష్యం శూన్యమని తేలినప్పటికీ, పాఠశాలలు, హాస్టళ్లలో క్రమం తప్పకుండా పరీక్షలు జరపాలని ఆదేశించారు. సచివాలయాల తనిఖీలు, కోర్టు కేసులు, వీఐపీ రెఫరెన్స్ లేఖల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

